ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





గొల్లప్రోలు మండలంలో 16వ జాతీయ రహదారిపై ఓ ప్రమాద దృశ్యం (ఫైల్‌ఫొటో)

ప్రాణాలు పోతున్నాయ్‌!

హైవే.. ఓ మృత్యుదారిగా మారింది. ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు భయాందోళనను కలిగిస్తున్నాయి. జాతీయ రహదారిలో ప్రయాణమంటే ఇంటికి చేరేదాకా క్షేమంగా చేరతామా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. డ్రైవర్ల నిర్లక్ష్యం, నిద్రమత్తు.. ఎందరో ప్రయాణికులు, వాహనదారులను బలితీసుకుంటున్నాయి. నిత్యం ఏదోక చోట ప్రమాదం జరగడం.. అంబులెన్సుల సైరన్‌లతో ఆ ప్రాంతం మార్మోగడం దడ పుట్టిస్తోంది. ఆయా రోడ్డు ప్రమాదాలతో ఈ ప్రమాదానికి సంబంధం లేని వారు సైతం అసువులు బాస్తున్నారు. మితిమీరిన వేగం కారణంగా జరిగే వాహన ప్రమాదాలతో ఏటా వందల సంఖ్యలో మృత్యువు ఒడికి చేరుతున్నారు. ముఖ్యంగా రహదారి పక్కనే పార్కింగ్‌ చేసిన వాహనాలను రహదారిలో వెళ్లే వాహనాలు ఢీకొని అత్యధికంగా మరణిస్తున్నారు. హైవే వెంబడి తెల్లవార్లూ తెరిచి ఉంచే దుకాణాల వద్ద, వివిధ కూడళ్ల వద్ద జరిగే ప్రమాదాలు కూడా లెక్కకుమించి ఉంటున్నాయి. జాతీయ రహదారుల భద్రత, ప్రమాదాల నివారణ కోసం నిర్దిష్టమైన ప్రణాళికలను అమలుచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం కూడా ప్రయాణికులకు, వాహనదారులకు శాపంగా మారింది.

- మృత్యు దారిగా మారిన జాతీయ రహదారులు
- హైవేలో నిత్యం ఏదొకచోట రోడ్డు ప్రమాదం
- అసువులు బాస్తున్న ప్రయాణికులు, వాహనదారులు
- అతివేగం, నిద్రమత్తు, డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రమాదాలకు హేతువులు
- వివిధ కూడళ్లు, రోడ్డు వెంబడి అర్ధరాత్రి తెరచి ఉండే దుకాణాలూ కారణమే
- రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు చర్యలు తక్కువ
- అధికారులు అలసత్వం వీడి చర్యలు తీసుకుంటేనే ప్రాణాలకు హామీ
- ఇప్పటికే ఏటా వందలాది మంది బలి, వారి కుటుంబాలు రోడ్డు పాలు

ప్రమాదాలకు నెలవు 'ప్రత్తిపాడు'.. కత్తిపూడి - రాజమండ్రి హైవేలో నెత్తుటి ధారలు



ప్రమాదాలకు నిలయమైన నరేంద్రగిరి ఆలయ జంక్షన్‌

ప్రత్తిపాడు, ఫిబ్రవరి26: ప్రత్తిపాడు హైవే ప్రమాదాలకు నిలయంగా మారింది. అన్నవరం నుంచి జగ్గంపేట వరకు ఈ రహదారిపై ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. తుని నుంచి గండేపల్లి వరకు విస్తరించి ఉన్న 16వ నెంబరు జాతీయ రహదారిపై నిత్యం ఏదొక రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంటోంది. సోమవారం తెల్లవారు జామున స్థానిక పాదాలమ్మ గుడి వద్ద టైర్‌ పంక్చర్‌ పనులు చేస్తున్న ముగ్గురు డ్రైవర్లు, బహిర్భూమికి వెళ్తున్న ఆలయ సేవకుడు బస్సు వెళ్లడంతో మృత్యువాత పడ్డారు. మితిమీరిన వేగంతో ఆర్టీసీ బస్సు వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగినట్టు ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఈ జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలు అతివేగం, నిర్లక్ష్యం, ట్రాఫిక్‌ నిబంధనలు పాటించకపోవడం వల్లనే జరుగుతున్నాయి. గతేడాది నుంచి ఇప్పటిదాకా ప్రత్తిపాడు సర్కిల్‌ పరిధిలో ఈ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 25 మందికి పైగా మృత్యువాతపడ్డారు. ధర్మవరం పెట్రోల్‌ బంకు వద్ద గత ఫిబ్రవరిలో ఇసుక లారీ, రొయ్యల కంటైనర్‌ లారీ ఢీ కొన్న దుర్ఘటనలో నలుగురు సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. అలాగే జోడిగడ్డెల వంతెన సమీపంలో ఒక శుభకార్యానికి వెళ్లే కారు డివైడర్‌ ఢీ కొనడంతో నలుగురు మృత్యువాతపడ్డారు. రాజమండ్రి నుంచి భువనేశ్వర్‌ వెళుతున్న ఆర్మీ ఉద్యోగి ప్రయాణిస్తున్న కారు ప్రత్తిపాడు మినర్వా వద్ద లారీ ఢీ కొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. విశాఖ నుంచి అనపర్తి వెళుతున్న క్రైస్తవ కుటుంబం చిన్నకారు ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్‌ వద్ద మలుపు తిరిగే లారీని ఢీ కొనడంతో కారులో ప్రయాణించే నలుగురు మృతి చెందారు. అదే విధంగా విశాఖ నుంచి సీతానగరం వెళుతున్న ఇన్నోవా కారు సుద్దగడ్డ మలుపు వద్ద డివైడర్‌ను ఢీ కొని అగాధంలోని గెడ్డలో పడడంతో కారు దగ్ధమై కారులో ఇరువురు మృత్యువాత పడ్డారు. ఇంకా చిన్నింపేట జంక్షన్‌ వద్ద జరిగిన పలు ప్రమాదంలో యర్రవరం, బూరుగుపూడిల మధ్య జరిగిన పలు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ జాతీయ రహదారిపై రోజూ రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారియి. మితిమీరిన వేగంతో వస్తున్న వాహనాలను అదుపుచేసే పరిస్థితి లేకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారి సమీపంలో వాహనాలు నిలపడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా లారీ డ్రైవర్లలో మార్పు కనిపించడం లేదు. రవాణాశాఖాధికారులు, పోలీసులు, హైవే అథారిటీ హైవేపై జరిగే ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదాలకు నెలవుగా మారిన జంక్షన్లు.. మలుపుల వద్ద అప్రమత్తంగా లేకుంటే అంతే..

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 26: జాతీయ రహదారుపై జంక్షన్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇక్కడే తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. మలుపులు ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఎన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినా నిత్యం ఏదొక ప్రమాదం జరుగుతూనే ఉంది. కత్తిపూడి నుంచి రాజమహేంద్రవరం వెళ్లే 16వ నెంబరు జాతీయ రహదారిపై కేహెచ్‌పేట నుంచి చెందుర్తి, వన్నెపూడి-కొడవలి సెంటర్‌ దాటి దర్మవరం మలుపు వరకూ గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌ పరిధి ఉంది. ఈ గ్రామాల జంక్షన్ల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గ్రామ రహదారులు నుంచి ఎన్‌హెచ్‌కు వచ్చే వాహనదారులు, పాదచారులు జాతీయ రహదారిపై వాహనాలు గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నారు. గొల్లప్రోలు పరిధిలో 16 నెంబరు జాతీయ రహదారిలో గతేడాది నుంచి ఇప్పటివరకూ 19కిపైగా ప్రమాదాలు జరుగగా 13 మంది మరణించారు. ఇదే మండల పరిధిలోని 216వ జాతీయ రహదారిపై 10కిపైగా ప్రమాదాలు జరగగా 11 మంది మరణించారు. ఇక పిఠాపురం పరిధిలోని 216వ జాతీయ రహదారిపై గతేడాది, ఇప్పటివరకూ 31 రోడ్డు ప్రమాదాలు జరగగా 15మంది మరణించారు. మరెందరో తీవ్ర గాయాలపాలయ్యారు. ముఖ్యంగా కత్తిపూడి నుంచి తిమ్మాపురం వరకూ గల 216వ జాతీయ రహదారిపై నిత్యం ఏదొక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. కొత్తగా నిర్మించిన ఈ రహదారిపై జంక్షన్ల ఉన్న ప్రాంతాల్లో ఎటువంటి ముందుజాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. కత్తిపూడి దాటిన తర్వాత సత్తెమ్మతల్లి గుడి, దుర్గాడ సెంటర్‌, చేబ్రోలు బైపాస్‌ వైజంక్షన్లు, చెందుర్తి, తాటిపర్తి సెంటర్లు, గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో బి. ప్రత్తిపాడు జంక్షన్‌, గొల్లప్రోలు, పిఠాపురం బైపాస్‌ల వై జంక్షన్లు, పిఠాపురం బైపాస్‌రోడ్‌లో రాపర్తి, విరవాడ, నరసింగపురం టీమ్‌నగర్‌ జంక్షన్‌, పాదగయ సెంటర్‌, చిత్రాడ తదితర ప్రాంతాలు ప్రమాదాలకు నెలవుగా మారాయి. వీటిని ప్రమాదకరమైన జంక్షన్లుగా గుర్తించి నాలుగేళ్లు దాటుతున్నా ఇప్పటివరకూ నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కొన్ని జంక్షన్ల వద్ద ఎన్‌హెచ్‌ అధికారులు కనీసం లైట్లు కూడా ఏర్పాటుచేయలేదు. పోలీసులు మా త్రమే రేడియం స్టిక్కర్లను స్టాపర్‌ బోర్డులపై అంటించి ప్రమాదాలు నియంత్రణకు చర్యలు చేపడుతున్నా సత్ఫలితాలు ఇవ్వడం లేదనే వాదన ఉంది.

హోటళ్ల వద్ద వాహనాలు ఆపినా ప్రమాదమే..



మల్లేపల్లి గ్రామశివారులో లారీని ఢీకొట్టి నలుగురి మృతికి కారణమైన వ్యాన్‌ (ఫైల్‌)

గండేపల్లి, ఫిబ్రవరి26: హైవే పక్కన రాత్రి సమయాల్లో వాహనాలు నిలపడం ప్రమాదంగా మారుతోంది. మండలంలో మురారి నుంచి నీలాద్రిపేట వరకు హైవే 16 వెంబడి 15కు పైగా హోటల్స్‌, దాబా రెస్టారెంట్లు ఉన్నాయి. వీటి వద్ద చీకట్లో వాహనాలు నిలిపివేయడంతో వెనుక నుంచి వస్తున్న వాహనాలు ఈ వాహనాలు కనిపించకపోవడంతో ఢీ కొట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొంతకాలం కిందట మల్లేపల్లి వద్ద ఓ హోటల్‌ వద్ద లారీ నిలిపివేయడంతో పశ్చిమగోదావరి నుంచి గాజువాక వెళుతున్న కళాకారుల ఆటో వెనుక నుంచి ఢీ కొట్టడంతో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.



ఢీకొట్టి వెళ్లిపోతున్న బస్సు (సీసీ కెమెరా చిత్రం)



ప్రమాదంలో మృతి చెందిన వారు

ఘోరం

- లారీ డ్రైవర్లపై దూసుకెళ్లిన ఆర్టీసీ సూపర్‌ లగ్జరీ బస్సు
- అక్కడికక్కడే నలుగురి దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు లారీడ్రైవర్లు.. మరొకరు ఆలయ సేవకుడు
- డ్రైవర్లు బాపట్ల జిల్లావాసులు.. మరొకరు స్థానికుడు
- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై దారుణ ఘటన
- ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ అరెస్టు

- 7లో



తేటగుంట హైవే పక్కన వాహనాల పార్కింగ్‌

బ్లాక్‌స్పాట్ల వద్ద తూతూమంత్రంగా చర్యలు

తుని రూరల్‌, ఫిబ్రవరి 26: ప్రత్తిపాడులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం మరోసారి జాతీయ రహదారి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. రాత్రి వేళల్లో ప్రమాదాలకు అధికంగా జరగడంతో గతంలో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని పోలీసింగ్‌ నిర్వహించి రాత్రి 11 దాటితే దాబాలు, ఇతరత్రా దుకాణాలు ఎట్టి పరిస్థితుల్లో తెరవకూడదని కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వారు స్థానిక నాయకుల ఒత్తిళ్లతో చూసీచూడనట్టు వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో రాత్రి వేళ మూత పడాల్సిన దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లు దుకాణాలు 11 గంటలకు మూసివేస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటారు. అయితే దుకాణాలు తెరిచే ఉండడంతో వారు వాహనాలు రోడ్డుపైనే ఆపి దుకాణాల్లోకి వెళుతున్నారు. ఈ క్రమంలోనే ఆగి ఉన్న వాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అటుఇటు రాత్రి పగలు వివిధ వాహనాలు దూసుకుపోయే 16వ నెంబరు జాతీయ రహదారిపై ప్రధాన కూడలి వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, బ్లాక్‌స్పాట్‌ల వద్ద తూతూమంత్రంగా చర్యలు చేపట్టడం, జాతీయ రహదారి ప్రధాన కూడళ్లలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వి.కొత్తూరు కూడలిలో మలుపు తిరుగుతున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సును ఓ ఇనుప లోడు లారీ ఢీ కొనడంతో 23 మంది గాయపడ్డారు. ఇక తుని- అన్నవరం మధ్య 9 ప్రధాన కూడళ్ల వద్ద గత మూడేళ్లలో సుమారు 120కి పైగా రహదారి ప్రమాదాలు నమోదయ్యాయి. ఆయా రోడ్డు ప్రమాదాల్లో 56 మంది దుర్మరణం చెందగా వందలాదిమంది ప్రయాణికులు, వాహనదారులు గాయాలతో బయటపడ్డారు.

జిల్లా స్థాయి స్పందనకు 415 అర్జీలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 26 : జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందనకు 415 అర్జీలు అందాయి. సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్‌ స్పందన సమావేశ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ కృతికాశుక్లాతోపాటు డీఆర్వో డి.తిప్పే నాయక్‌, హౌసింగ్‌ పీడీ కె శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్‌, జడ్పీ డిప్యూటీ సీఈవో రాంగోపాల్‌లతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఈ అర్జీలను సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్‌ ఆదేశాలు జారీచేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్‌ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల గోడువింటున్న ఎస్పీ సతీష్‌కుమార్‌

పోలీస్‌ స్పందనకు 61 ఫిర్యాదులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 26: వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానికంగా పరిష్కారం కాక విసిగి వేశారిపోయిన 61 మంది జిల్లావాసులు సోమవారం జిల్లా పోలీస్‌ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరై తమ గోడును ఎస్పీ సుబ్రమణి సతీష్‌ కుమార్‌కు విన్నవించారు. వారి గోడు క్షుణ్ణంగా విన్న ఎస్పీ తక్షణం స్పందించి సంబంధిత పోలీస్‌ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా మాట్లాడి ఫిర్యాదుదారుల అర్జీలు సమ్మతమైనవైతే వెంటనే ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి సాధ్యమైనంత త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా పోలీస్‌ శాఖపై మరింత నమ్మకం ఏర్పడుతుందన్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 61 ఫిర్యాదులు రాగా వాటిలో సివిల్‌ వాదాల సంబంధించి 21, కుటుంబ తగాదాలు 10, ఇతర సమస్యలు సంబంధించి 30 ఫిర్యాదులు అందాయి. స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు కాకినాడ రామారావు పేటకు చెందిన చార్టెర్డ్‌ అకౌంటెంట్‌ డీపీఆర్‌ స్వామి ఏర్పాటుచేసిన భోజనాన్ని ఎస్పీ అర్జీదారులకు వడ్డించారు. కార్యక్రమంలో అడ్మిన్‌ ఎస్పీ ఎంజెవి భాస్కరరావు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



యుద్ధ విమానం వద్ద ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు తదితరులు

యుద్ధవిమాన ప్రదర్శనశాలకు ప్రారంభోత్సవం

కాకినాడ బీచ్‌ పార్కులో టీఎం-142ఎం ఎయిర్‌క్రాఫ్ట్‌ మ్యూజియం ఏర్పాటు

కాకినాడరూరల్‌, ఫిబ్రవరి26: కాకినాడ బీచ్‌ పార్కు వద్ద కాకినాడ అర్బన్‌ డవలప్‌మెంటు అథారిటీ (కొడా) ఆధ్వర్యంలో రూ.5.89 కోట్లతో ఏర్పాటుచేసిన టీఎం-142ఎం విమాన ప్రదర్శనశాలను కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌ రెడ్డి, కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ కాకినాడ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధిచేయడంతోపాటు భారత సాయుధ దళాల కార్యకలాపాలపై యువతలో స్ఫూర్తిని రగిలించే లక్ష్యంతో భారత నౌకాదళానికి చెందిన టీఎం-142ఎం యుద్ధవిమాన ప్రదర్శనను ఏర్పాటుచేశామన్నారు. భారత రక్షణ రంగం, నౌకాదళంలో 30 ఏళ్ల సేవలు అందించిన ఎయిర్‌క్రాఫ్ట్‌ను కాకినాడ బీచ్‌ పార్కులో ఏర్పాటుచేసుకోవడం శుభపరిణామమన్నారు. జేసీ ప్రవీణ్‌ ఆదిత్య, కొడా చైర్మన్‌ చంద్రకళాదీప్తి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ జంగా గగారిన్‌, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీ టెట్‌-24 పరీక్షలు

- 5 ఆన్‌లైన్‌ కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 5,880 మంది అభ్యర్థులు

కాకినాడ రూరల్‌, ఫిబ్రవరి 26: ఏపీ టెట్‌-24 పరీక్షలు మంగళవారం ప్రారంభం కానున్నాయని మార్చి 6 వరకూ కొనసాగుతాయని కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్‌ తెలిపారు. జిల్లాలోని 5 ఆన్‌లైన్‌ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్షలను కాకినాడలోని అచ్యుతాపురంలో ఉన్న ఐయాన్‌ డిజిటల్‌ జోన్‌, సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్‌ కళాశాలలోని 3 కేంద్రాల్లోనూ, ప్రగతి ఇంజనీరింగ్‌ కళాశాలలోని ఒక కేంద్రంలోనూ నిర్వహించనున్నామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 5,880 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షలకు హాజరయ్యే వారు పరీక్షా కేంద్రానికి లేటెస్ట్‌ ఫొటో, గుర్తింపు కార్డుతో హాజరుకావాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. వివరాలకు 9989552224 నెంబర్లో సంప్రదించాలని డీఈవో సూచించారు.



సాంకేతిక పరిజ్ఞానంతో పదో తరగతి ప్రశ్నపత్రాలు

- కాకినాడ జిల్లావ్యాప్తంగా 137 పరీక్షా కేంద్రాలు.. హాజరుకానున్న 32,262 మంది విద్యార్థులు
- మార్చి 18 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి : డీఈవో రమేష్‌

కాకినాడ రూరల్‌, ఫిబ్రవరి26 : ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పబ్లిక్‌ పరీక్షలను మార్చి 18 నుంచి 30వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. అయితే సాంకేతిక పరిజ్ఞానంతో పదో తరగతి ప్రశ్నాపత్రాలను రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం రూపొందించింది. దీంతో ఎవరైనా లీకు చేస్తే ఆ ప్రశ్నాపత్రం ఎక్కడి నుంచి వచ్చింది, ఏ జిల్లా, ఏ గ్రామం, కేంద్రం, పరీక్ష గది, చివరకు ఏ విద్యార్థికి సంబంధించినది అనేది కూడా తెలిసిపోతుందని కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్‌ తెలిపారు. ఈ ఏడాది కాకినాడ జిల్లావ్యాప్తంగా మొత్తం 32,262 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో రెగ్యులర్‌ విద్యార్థులు 27,856 మంది, రీఅప్పియర్‌ విద్యార్థులు 4,374 మంది, ఓఎస్‌ఎస్‌సీలో రెగ్యులర్‌ 25, రీఅప్పియర్‌ విద్యార్థులు ఏడుగురు ఉన్నారు. జిల్లాలోని 137 కేంద్రాలను పరీక్షల నిర్వహణకు ఏర్పాటుచేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగనున్నాయి. ఒకసారి ఫెయిలై రెగ్యులర్‌ విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరైన వారిని రెగ్యులర్‌ విద్యార్థులుగానే పరిగణించనున్నారు. సీడబ్ల్యూఎస్‌ఎన్‌ (చిల్డ్రన్‌ విత్‌ స్పెషల్‌ నీడ్‌) స్క్రైబ్‌ విద్యార్థులు జిల్లాలో 32 మంది ఉన్నారని, వారు స్థానిక పరీక్ష కేంద్రంలోని 9వ తరగతి విద్యార్థుల సహాయంతో పరీక్ష రాస్తారన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పరీక్ష ప్రారంభ సమయంకంటే అర్ధగంట ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతిస్తామన్నారు. అయితే ఒకేసారి గుంపులుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వస్తే మాత్రం అనుమతించేదిలేదన్నారు. మొత్తం 7 పేపర్లకు పరీక్షలుంటాయని, ఫిజికల్‌ సైన్స్‌, బయోలాజికల్‌ సైన్స్‌ పరీక్షలు వేర్వేరుగా ఉండనున్నాయన్నారు. ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కుల చొప్పున తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సాంఘికశాస్త్రానికి 500 మార్కులకు, పీఎస్‌కు 50, ఎన్‌ఎస్‌కు 50 మొత్తం 600 మార్కులకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షలను పర్యవేక్షించేందుకు 6 ఫ్లయింగ్‌, 28 సిట్టింగ్‌ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశారు. కాగా మార్చి 31 నుంచి 10వ తరగతి పరీక్షల మూల్యాంకనం ప్రారంభం కానుంది. ప్రతీ విద్యార్థి తన జీవితంలో మొదటిసారి రాసే పబ్లిక్‌ పరీక్ష ఇది. కాబట్టి విద్యార్థులు ఏవిధమైన ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉంటూ పరీక్షలకు సిద్ధం కావాలి. అదే విధంగా ఉపాధ్యాయులుగానీ విద్యార్థుల తల్లిదండ్రులుగానీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులపై ఏవిధమైన ఒత్తిడి తీసుకురాకూడదని, వారిని ప్రోత్సహించేవిధంగా మాట్లాడాలని డీఈవో పిల్లి రమేష్‌ సూచించారు.

బోట్‌క్లబ్‌ చెరువులో పడి వృద్ధురాలి ఆత్మహత్య



సర్పవరం జంక్షన్‌, ఫిబ్రవరి 26: వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలతో కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఓ వృద్ధురాలు జీవితంపై విరక్తితో స్థానిక బోట్‌క్లబ్‌ చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాకినాడ నాగమల్లితోట జంక్షన్‌లో నివాసం ఉంటున్న కాళ్ల కాశీనాథ్‌, సరోజ (73) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలుకాగా వివాహాలు జరిగి వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. భర్త బ్యాంకులో పనిచేస్తూ పదవీ విరమణ చేశారు. ఇంట్లో ఇద్దరే నివాసం ఉంటున్నారు. గత కొన్నేళ్లుగా సరోజ అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి సరోజ తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త, బంధువులు ఆచూకీ కోసం గాలించారు. సోమవారం స్థానిక బోట్‌క్లబ్‌ పార్కులో చెరువులో సరోజ మృతదేహం లభించడంతో కుటుంబ సభ్యులు వచ్చి గుర్తించారు. భర్త కాశీనాథ్‌ ఫిర్యాదు మేరకు ఈమె అనారోగ్యంతో కుటుంబానికి భారం కాకూడదనే భావించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సర్పవరం ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ యువకుడు మృతి

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 26: వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. సామర్లకోట మండలం పి వేమవరం గ్రామానికి చెందిన జల్లిగంపల సురేష్‌ (21) వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబీకులు తీవ్ర అస్వస్థతకు గురైన సురేష్‌ను హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆ యువకుడు పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇర్రిపాకలో మహా రుద్రాభిషేకం ప్రారంభం

- 7లో

ద్రాక్షారామలో వైభవంగా శ్రీపుష్పోత్సవం

- 7లో

వారం రోజుల్లోగా ఎమ్మెల్యే ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి

- లేకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం
- పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం

- 7లో

ఘోరం

- లారీడ్రైవర్లపై దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- అక్కడికక్కడే నలుగురి మృతి
- మృతుల్లో ముగ్గురు లారీడ్రైవర్లు.. మరొకరు ఆలయ సేవకుడు
- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు హైవేపై దారుణ ఘటన
- ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ అరెస్టు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 26: పంక్చర్ అయిన లారీ టైరు మారుస్తున్న డ్రైవర్లపై మృత్యుశకటంలా ఆర్టీసీ బస్సు దూసుకువచ్చింది. ఈ ఘటనలో ముగ్గురు డ్రైవర్లు ప్రాణాలు కోల్పోగా అమ్మవారి ఆలయ సేవకుడు కూడా మృత్యువాతకు గురయ్యాడు. ఈ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సమీపంలో పాదాలమ్మ గుడి వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున జరిగింది. స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్యక్ష సాక్షులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా బల్లికురువ మండలం నక్కబొక్కలపాడుకు చెందిన డ్రైవర్ బండి నాగయ్య(26), అదే మండలానికి చెందిన రామాంజనేయపురం గ్రామానికి చెందిన దాసరి కిషోర్(50), దాసరి ప్రసాద్(40) లారీడ్రైవర్లు. వీరు ముగ్గురు దాసరి ప్రసాద్, బండి నాగయ్య ఒక లారీపై, దాసరి కిషోర్ మరో లారీపైన ఒడిసా నుంచి బాపట్లకు హెచ్‌పీ వైర్ల లోడుతో బయల్దేరారు. వీరి రెండు లారీలు ఒకదాని వెంట మరొకరి ప్రయాణిస్తుండగా 16వ నెంబరు జాతీయ రహదారి ప్రత్తిపాడు పాదాలమ్మ గుడివద్దకు సోమవారం తెల్లవారుజామున 4గంటలకు చేరుకోగానే వెనుక లారీ టైరు పంక్చర్ అయింది. దీంతో రెండు లారీలు పాదాలమ్మగుడి సమీపంలో రోడ్డు మార్జిన్ వద్ద నిలిపివేసి ముగ్గురు డ్రైవర్లు పంక్చర్ అయిన టైర్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో విశాఖపట్నం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా బస్సును నడుపుతూ టైర్ పంక్చర్ పనులు చేస్తున్న ముగ్గురు డ్రైవర్లపై దూసుకువెళ్లాడు. అదే క్రమంలో పాదాలమ్మ ఆలయం వద్ద గల షెల్టర్ నుంచి బహిర్భూమికి వెళ్తున్న ఆలయ సేవకుడు దివిలి లోవరాజు(29)ను కూడా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు డ్రైవర్లు, ఆలయ సేవకుడు తీవ్ర గాయాలతో సంఘటనాస్థలం వద్దే మృతి చెందారు. ఈ ఘటనకు కారణమైన ఆర్టీసీ బస్సును డ్రైవర్ నిలుపుదల చేయకుండా రాజమహేంద్రవరం తీసుకువెళ్లిపోయాడు. బస్సులో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. నలుగురు వ్యక్తులు రహదారి చెంతనే మృత్యువాత చెందడంతో ఆ ప్రదేశమంతా రక్తపు మడుగులా మారింది. ప్రమాద విషయం తెలిసి పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమార్, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం ఎస్‌ఐలు ఎం.పవన్‌కుమార్, జి.సష్ కిషోర్, స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ నిర్వహించారు. నాలుగు మృతదేహాలను ఆటోలపై స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి మృతుల బంధువులకు అప్పగించారు. దీనిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నాగయ్య


కిషోర్


ప్రసాద్


లోవరాజు


ఆటోలో మృతదేహాలు


బంధువుల రోదన


ప్రమాదానికి కారణమైన బస్సు


సంఘటన స్థలంలో పోలీసులు

పోలీసుల అదుపులో ఆర్టీసీ బస్సు డ్రైవర్

పాదాలమ్మ గుడి వద్ద నిర్లక్ష్యంగా బస్సు నడిపి నలుగురు మృతికి కారణమైన రాజమండ్రి ఆర్టీసీ డిపోకు చెందిన పిల్లా శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నలుగురు మృతి ఘటన జరిగినా బస్సు డ్రైవర్ పిల్లా శ్రీనివాస్ బస్సును రాజమహేంద్రవరానికి తీసుకువెళ్లిపోయాడు. దీంతో పోలీసులు అతడ్ని రాజమండ్రిలో అదుపులోకి తీసుకుని ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది.

మిన్నంటిన రోదనలు

పాదాలమ్మ తల్లి గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురు వ్యక్తుల కుటుంబీకుల రోదనలతో ప్రత్తిపాడు ఆసుపత్రి కన్నీటిసంద్రంగా మారింది. కుటుంబానికి ఆధారంగా ఉండే లారీడ్రైవర్ల జీవితాలు తెల్లవారుతూనే తెల్లారిపోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. బాపట్ల జిల్లా బల్లికురువ మండలం నక్కబొక్కలపాడు, రామాంజనేయపురం లారీ డ్రైవర్ల స్వగ్రామాలు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు బంధువులకు సమాచారం అందించడంతో సోమవారం మధ్యాహ్నానికి ప్రత్తిపాడు ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ప్రమాదంలో స్థానికంగా ఉంటున్న దివిలి లోవరాజుది విశాఖపట్నం. ఆరేళ్లుగా స్థానిక పాదాలమ్మ గుడి వద్ద సేవకుడిగా ఉంటూ బహిర్భూమికి వెళ్తూ ఊహించని విధంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. లోవరాజు తల్లి సన్యాసమ్మ, తండ్రి త్రినాథ్, సోదరుడు శివాజీ, సోదరి రమ్యకృష్ణ విలపిస్తున్న కంటతడి పెట్టించింది. మృత్యువాతపడ్డ డ్రైవర్లలో దాసరి కిషోర్, దాసరి ప్రసాద్ అన్నదమ్ములు. వీరి అమ్మ, అక్క, తమ్ముడు కూడా సంవత్సర కాలంలోనే మృతి చెందారు. కిషోర్‌కు భార్య శ్యామల, కుమార్తె అక్షిత, కుమారుడు హర్ష ఉన్నారు. ప్రసాద్‌కు భార్య వరలక్ష్మి, కుమార్తెలు లక్ష్మి, కిరణాంజలి, లిఖిత, ప్రసన్న లక్ష్మి ఉన్నారు. బండి నాగయ్యకు భార్య లిల్లి గ్రేస్, ఏడాదిన్నర కుమార్తె కోమలి, మరో 15రోజులు వయస్సు గల బాబు ఉన్నారు. నాగయ్య ఆకస్మిక మరణంతో అతడి కుటుంబీకులు ఆసుపత్రి వద్ద కుప్పకూలిపోయారు.


శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

చెట్టును ఢీకొన్న కారు

యువకుడి మృతి..డ్రైవర్‌కు గాయాలు

ఎటపాక, ఫిబ్రవరి 26: ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, టేకులపల్లి గ్రామానికి చెందిన జాటోత్ శ్రీనివాస్ (23) తన కారులో డ్రైవర్‌తో మారేడుమిల్లి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో బాసవాగు మూలమలుపు వద్దకు రాగానే కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టుని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీనివాస్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28 నుంచి తెలుగు భాషా సదస్సు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 26: తెలుగు భాషా సాహిత్యాలపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఈ నెల 28 నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని ఎస్వీకేపీ, డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. నన్నయ వర్సిటీ అనుబంధ కళాశాలలో జరుగుతున్న ఈ సదస్సుకు యూనివర్సిటీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సమావేశాలకు 2వ అంతర్జాతీయ తెలుగు సమావేశాలుగా నామకరణం చేసినట్లు చెప్పారు. గత ఏడాది జరిగినఈ సమావేశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇచ్చిందన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం


దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 26: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన గంధం రాజేష్‌కుమార్-దుర్గాదేవి దంపతులు రూ.5 లక్షలు విరాళం సమర్పించారు. వారికి ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,75,356 లభించినట్టు ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహుని హుండీల ఆదాయం రూ.41.23 లక్షలు


ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అంతర్వేది, ఫిబ్రవరి 26: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయాలను సోమవారం లెక్కించారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.40,14,406, గుర్రాలక్కమ్మ వారి హుండీ ద్వారా రూ.80,044, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.29,432, మొత్తం హుండీల ఆదాయం రూ.41,23,882 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.37,822 వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖాధికారి, అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహుదూర్, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 26: ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ మెన్, ఉమెన్-2024 పోటీలు ఉత్కంఠభరితంగా ముగిసాయి. పురుషుల విభాగంలో విజేతల వివరాలను అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు సోమవారం వెల్లడించారు. స్ట్రాంగ్ మెన్ విన్నర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన ఎ.బాలకృష్ణ, రన్నరప్‌గా అమలాపురానికి చెందిన ఎం.వీరేంద్ర నిలిచారు. ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ విన్నర్‌గా అమలాపురం, రన్నరప్‌గా రాజమహేంద్రవరం నిలిచాయి. 59 కిలోల విభాగంలో బి.యశ్వంత్ (అమలాపురం), వై.రాజు (రాజమహేంద్రవరం), ఎం.కిరణ్ (రాజమహేంద్రవరం), 66 కిలోల విభాగంలో ఎం.మధుసూదన్ (రాజమహేంద్రవరం), వి.లవకుమార్ (ముమ్మిడివరం), వై.పుత్రరాజు (రామచంద్రపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 74 కిలోల విభాగంలో ఎ.బాలకృష్ణ (రాజమహేంద్రవరం), పి.జోసఫ్ (రామచంద్రపురం), వి.మహేష్ (ముమ్మిడివరం), 83 కిలోల విభాగంలో ఎం.సాయి (ముమ్మిడివరం), ఎం.రాహుల్‌బాబు (అమలాపురం), ఎం.వెంకటేష్ (అమలాపురం), 93 కిలోల విభాగంలో ఎం.వీరేంద్ర (అమలాపురం), ఎస్.సాయి (అమలాపురం), పి.మోహన్ (ముమ్మిడివరం), 93 కిలోలు పైబడిన విభాగంలో వి.వంశీ (ముమ్మిడివరం), సీహెచ్ వెంకటేష్ (రాజమహేంద్రవరం), డి.వీరమణికంఠ (ముమ్మిడివరం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. మాస్టర్స్ విభాగంలో 40 నుంచి 50 ఏళ్లలోపు నిర్వహించిన పోటీల్లో డీఆర్కే నాగేశ్వరరావు (ద్రాక్షారామ), చీకురుమెల్లి కిరణ్‌కుమార్ (అమలాపురం), డి.నాగేశ్వరరావు (ద్రాక్షారామ), 60 ఏళ్లలోపు విభాగంలో జీఎస్ఎన్ మూర్తి, ఏఎస్ సత్యనారాయణ, ఎల్ఎస్ఎన్ మూర్తి (అమలాపురం) వరుస స్థానాలు సాధించారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన డీవీ సత్యనారాయణ, దొమ్మేటి వెంకటరమణ, ఎంవీ సముద్రం, వి.నరేష్, జి.గణేష్‌బాబు, యు.లక్ష్మీనారాయణ, చిక్కం రాజబాబు, నార్ని శ్రీను న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. టీడీపీ యువ నాయకుడు గంధం పల్లంరాజుతో పాటు గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు, డాక్టర్ గంధం విశ్వనాథ్, జయన సత్తిరాజు విజేతలకు బహుమతులు, షీల్డులను సమకూర్చారు. డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో విజేతలకు వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ ఆధ్వర్యంలో ప్రముఖులు దున్నాల దుర్గ, నల్లా సంజయ్, ఆర్డీఎస్ ప్రసాద్, కల్వకొలను ఉమా, మోకా వెంకటసుబ్బారావు, ఆశెట్టి ఆదిబాబు బహుమతులు అందజేశారు.

బంగారు దొంగలను పట్టేశారు

- సినీ ఫక్కీలో దొంగతనం.. కేసులో మొత్తం 12 మంది నిందితులు
- ఐదు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు
- 9 మంది అరెస్టు.. 3.50 కిలోల బంగారం రికవరీ


స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులను మీడియాకు చూపిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కేటుగాళ్లు సినీ ఫక్కీలో భారీ దొంగతనం చేస్తే.. తూర్పుగోదావరి జిల్లా పోలీసులు తమదైన రూటులో వెళ్లి కేవలం ఐదు రోజుల్లో ఆటకట్టించారు. ఈ మేరకు ఎస్పీ జగదీశ్ వివరాలను వెల్లడించారు. భీమవరానికి చెందిన బాలు నాథూరామ్ బంగారం షాపుల నుంచి వచ్చే ఆర్డర్ల ప్రకారం ఆభరణాలను సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 21న తన కారులో ఆభరణాలు షాపులకు ఇవ్వడానికి దూబచర్ల, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం బయలు దేరారు. చీకటి పడుతున్న సమయంలో కొయ్యలగూడెం దాటిన తర్వాత ఇన్నోవాలో ఐదుగురు దుండగులు వచ్చి తాము ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ నాథూరామ్‌ని ఆపారు. బాలును, డ్రైవరు సురేశ్‌ని తమ కారులో ఎక్కించుకున్నారు. ఐదుగురిలో ఇద్దరు దుండగులు నాథూరామ్ కారులో బయలుదేరారు. రాజమహేంద్రవరం దగ్గరలోని దివాన్ చెరువు, లాలాచెరువు ప్రాంతాలు తిప్పి నాలుగో వంతెన సమీపంలోని జీరో పాయింట్ వద్ద నాథూరాంను దించేసి ఆయన కారును అప్పగించి దుండగులు పరారయ్యారు. కారులోని 3.50 కిలోల ఆభరణాలు, రూ.5 లక్షల నగదు అపహరణకు గురైందని గమనించి నాథూరాం పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో దోపిడీ నల్లజర్ల పోలీస్ స్టేషను పరిధిలో జరిగినట్టు గుర్తించి ఆ స్టేషనులో కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. దర్యాప్తులో కొందరు అనుమానాస్పద వ్యక్తులు ఇన్నోవాలో విజయవాడ వైపు వెళ్తున్నారనే సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. కారులోని వాళ్లను ప్రశ్నించిన అనంతరం 12 మందిని నిందితులుగా గుర్తించామని ఎస్పీ వివరించారు. వీళ్లలో జంగారెడ్డిగూడెంకు చెందిన చలపాక వెంకటేష్, మద్దిపాటి కల్యాణ్, కోడూరి రవితేజ, కోనా శ్రీనివాస్, వేముల మంజుబాబు, షేక్ నాగూర్ మీరావలి, వేముల మోహన్ సాయి, మోహన్ నారాయణ్ కుంబాకర్, పమిడిపల్లి బ్రహ్మాజీలను అరెస్టు చేశామన్నారు. వీరందరూ పాత నేరస్తులని, నగల వ్యాపారం చేసేవాళ్లు, తయారీ దారులు కూడా ఉన్నారన్నారు. పథకం ప్రకారం దోపిడీకి దిగారన్నారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. సుమారు రూ.2 కోట్ల విలువైన 181 బంగారు గొలుసులు, కరిగించిన బంగారు కడ్డీలు మొత్తం 3.50 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, నల్లజర్ల సీఐ కె.దుర్గాప్రసాద్, రాజమహేంద్రవరం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు కె.రజనీకుమార్, కె.విజయబాబు, ఉమామహేశ్వరరావు, దేవరపల్లి ఎస్ఐ కె.శ్రీహరి, టీవీ సురేశ్, ఐటీ కోర్ ఎస్ఐ ఎం.అయ్యప్పరెడ్డి తదితర సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

వారం రోజుల్లోగా ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి

- లేకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం
- పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం


విలేకర్లతో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 26: మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వారం రోజుల్లోగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే ఫిషర్‌మెన్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని యానాం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అల్టిమేటం జారీ చేశారు. కాకినాడలోని కాస్మోపాలిటిన్ క్లబ్ హాల్‌లో సోమవారం ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార కుల సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కృష్ణారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారంపూడి ఈ నెల 17న మాజీ ఎమ్మెల్యే కొండబాబును విమర్శిస్తూ మత్స్యకార జాతిని కించపరిచేలా వ్యాఖ్యలు చేశారన్నారు .అప్పటి నుంచి మత్స్యకారులు పలు విధాలుగా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నా ద్వారంపూడి వైఖరిలో మార్పు రాలేదన్నారు. ద్వారంపూడి ఈ వ్యాఖ్యలు చేసి పది రోజులవుతున్నా ఇప్పటివరకు మత్స్యకార జాతికి క్షమాపణ చెప్పకపోవడం పట్ల ఆయన అహంకార వైఖరి అర్థమవుతోందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంఎస్ఎన్ చారిటీస్ విద్యాసంస్థలు, అంతర్వేది దేవాలయాలు కట్టించిన దాతలు నాయకర్, కృష్ణమ్మలు మత్స్యకార జాతికి చెందినవారేనని తెలుసుకోవాలన్నారు. మత్స్యకార నాయ కులు సైకం రాజశేఖర్, బర్రి ప్రసాద్ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం కాకినాడలో మత్స్యకారుల సమా వేశానికి ఆటంకాలు కలిగించి ద్వార ంపూడి గడ్డపారతో తన గొయ్యి తానే తవ్వుకున్నాడని, ఇప్పుడు పూర్తిగా ఆ గొయ్యిలో కూరుకుపోయాడన్నారు. ఆయన ఓట్ల ప్రచారానికి వచ్చి నప్పుడు మత్స్యకారులు ఇంటి తలుపులు వేసుకుని నిరసన తెలపాలన్నారు. గతంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను కూడా అవమానపరచిన నీచ చరిత్ర అతనికి ఉందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బలసాడి ఇందిర, మత్స్యకార నాయకులు మల్లాడి రాజు, తుమ్మల సునీత, తుమ్మల రమేష్, కోలా ప్రసాదవర్మ, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, బొడ్డు సత్యనారాయణ, పినపోతు తాతారావు, మల్లాడి రాజేంద్రప్రసాద్, కర్రి చిట్టిబాబు, చోడిపల్లి సతీష్, బడే కృష్ణ, బాలిపల్లి రాజు, గంటా వెంకటలక్ష్మి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇరిపాకలో మహా రుద్రాభిషేకం ప్రారంభం


పీఠాధిపతి శివస్వామితో జ్యోతుల నెహ్రూ, వనమాడి

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 26: జగ్గంపేట మండలం ఇరిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకం కార్యక్రమాన్ని సోమవారం అమరావతికి చెందిన శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శివస్వామి ప్రారంభించారు. ముందుగా జ్యోతుల నెహ్రూ-మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులతో పాటు 24జంటలు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షా బంధం, పంచగవ్య ప్రాసన, దీక్షా ధారణ, గోపూజ, వేద పారాయణం, యాగశాల ప్రవేశం మహాన్యాస పారాయణ జ్యోతిర్లింగాల ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన, లక్ష్మీగణపతి హోమం నిర్వహించి, సాయంత్రం సౌరాష్ట్ర సోమనాదేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామి ఈ మహా కుంభాభిషేకాన్ని నిర్వహించి భక్తులకు ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ ఇంతటి మహత్తర కార్యక్రమం నిర్వహించాలంటే ఆ భగవంతుని ఆశీస్సులు ఉండాలన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ 11 రోజుల పాటు ఈ మహాకుంభాభిషేకం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కోటి మట్టి శివలింగాలకు భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకం చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎంసీ హరీష్ బాలయోగి, చిక్కాల రామచంద్రరావు, వనమాడి కొండబాబు, కోర్పు లచ్చయ్యదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా తాతాజీ, జిల్లాలోని, నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

అమృత్ భారత్ పథకంతో రాజమండ్రి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన రాజమండ్రి రైల్వే స్టేషన్ రూపురేఖలను సమూలంగా మార్చేందుకు అమృత్ భారత్ పథకానికి ఎంపిక చేసిన ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ని అధునాతనంగా తీర్చిదిద్దే పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కోసం రైల్వే అధికారులు రైల్వే స్టేషనులో ప్రత్యేక వేదిక, స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను ఆధునీకీకరించే దిశగా ప్రధాని మోదీ చర్యలు చేపట్టడం స్వాగతనీయమన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.270 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఫైవ్‌స్టార్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ రైల్వే స్టేషనుగా మారబోతోందన్నారు. గోదావరిపై మరో వంతెనకు రైల్వే వద్ద ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. విశాఖ-విజయవాడ నడుమ మూడో లైను వేస్తున్నారని, నాలుగోలైను ఆవశ్యకత కూడా ఉందన్నారు. వికసిత్ భారత్, వికసిత్ అమృత్ అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, జీఆర్పీ సీఐ విజయ్‌శంకర్, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏడీ ఆర్ఎం డి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఇన్‌చార్జి డి.ప్రసాద్, సమన్వయకర్త సీసీఐ కల్యాణ్ కుమార్, ఎస్ఎంఆర్ రంగనాథ్, ఐవోడబ్ల్యూ ప్రసాద్, సీటీఐ చంద్రమౌళి, ఎస్ఎస్ఈ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో వైభవంగా శ్రీపుష్పోత్సవం



ద్రాక్షారామ: ఫిబ్రవరి 26: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7.05 భీమేశ్వరుని శ్రీపుష్పోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణ మూర్తులను పుష్పాలు, చందన, కర్పూరాలతో అలంకరించారు. అనంతరం తూగుటుయ్యాలపై ఉంచి ఊయలాడించారు. పూజాధికాలు ఆస్థాన బ్రహ్మ దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకస్వాములు, వేదపండితులు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులకు దంపత తాంబూలాలు అందజేశారు. ఈవో పి.టి.వి సత్యనారాయణ, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంపూర్ణ విద్య అందించే విద్యా విధానం అవసరం

ఆలిండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) మహాసభల్లో వక్తలు

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన విద్యా విధానాన్ని నిలుపుదల చేయాలని, ప్రతి విద్యార్థికి సంపూర్ణ విద్య అందేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆలిండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ (అప్పా) 3వ రాష్ట్ర మహాసభ సోమవారం స్థానిక పిల్లా మరియమ్మ ప్రాంగణంలో విజయవంతంగా జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, మాజీ శాసనమండలి సభ్యురాలు అంగులూరి లక్ష్మీశివకుమారి, పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, ఆంధ్ర మాలమహానాడు అధ్యక్షుడు ఎస్.కొండబాబు హాజరయ్యారు. విద్య-వైద్య రంగాలు పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన విద్యార్థులకు అన్ని వసతులు పూర్తి స్థాయిలో కల్పించి విద్యను సంపూర్ణంగా ఉచితంగా అందించడంతో పాటు సన్న బియ్యంతో ఆహారం, కాస్మెటిక్స్ అందించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం డీఎస్సీ ద్వారా శాశ్వత ఉపాధ్యాయులను ప్రతీ స్కూల్‌లో నియమించాలన్నారు. అనంతరం డాక్టర్ పిల్లా చంద్రం నూతన అధ్యక్షునిగా 41 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ అధ్యక్షుడు పిల్లి శివకుమార్, గిరిజన హక్కుల సాధన సంఘం కన్వీనర్ బి.విప్లవకుమార్, కెవీపీఎస్ జిల్లా నాయకులు కె.సింహాచలం, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గుబ్బల ఆదినారాయణ, ఏఐసీసీటీయూ రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ, కనకరాజు, తణుకుల యోహాన్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణుడు విగ్రహ ప్రతిష్ట

గండేపల్లి: మండలంలో జెడ్.రాగంపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ కందుల చిట్టిబాబు రూ.4లక్షలు విరాళంగా ఇవ్వగా కందుల గోవింద చౌదరి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా కంటే రాజు, కంటే సురేంద్ర, యాదవ సంఘం సభ్యులు ఆర్థిక సహాయంతో ఆలయానికి టైల్స్, గ్రిల్స్ విరాళంగా అందించడంతో ఆలయ కమిటీ వారికి అభినందనలు తెలిపారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



చేబ్రోలులో టీడీపీలో చేరిన వారితో వర్మ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 26: వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు ఆ పార్టీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రంలో ప్రజల్లో వస్తున్న మార్పులకు ఇది నిదర్శనమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన కీలక నేతలు రావు రవిబాబు, బుద్దాల పల్లయ్య, లోకారెడ్డి మణిబాబు, దొర మిత్రబృందం సహా భారీగా నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరందరికీ వర్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సైకో జగన్ పాలనతో విసిగిపోయిన ప్రజలు అతడిని ఇంటికి పంపుదామని చూస్తున్నారని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్, ఓరుగంటి వీరబాబు, దూళ్ల లచ్చబాబు, కర్రి బుజ్జి, ఉలవకాయల వినయ్‌నాయుడు, బాబూరావు, నానాజీ, చేదులూరి నాగబాబు, నేమాల బాబి, మఠం బాబీ పాల్గొన్నారు.

కొంతంగిలో వైసీపీ నుంచి టీడీపీకి చేరికలు

శంఖవరం, ఫిబ్రవరి 26: వైసీపీ అరాచకపాలన పోవాలంటే నియోజకవర్గమంతా ఏకమై టీడీపీ గెలుపునకు కృషి చేయాలని టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. కొంతంగిలో బద్ది సురేష్, సర్ల సత్యనారాయణ, కోనా అప్పారావు, పూర్ణయ్య, సత్యనారాయణ సోమవారం టీడీపీలోకి చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు బద్ది రామారావు, పర్వత సురేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, ముదునూరి మురళీకృష్ణంరాజు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుభాష్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలకు పెరుగుతున్న ప్రజాదారణ



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న చంద్రశేఖర్ యాదవ్, సత్యప్రభ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమిలకు ప్రజాధారణ పెరుగుతుందని ఆ పార్టీ పరిశీలకుడు చంద్రశేఖర్ యాదవ్, ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ తెలపారు. పార్టీ కార్యాలయంవద్ద సోమవారం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన కూటమి సీట్ల ప్రకటన తర్వాత వస్తున్న ప్రజాదారణ చూసి వైసీపీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. 27న ప్రత్తిపాడులో జరిగే ఎన్నికల ప్రచారసభకు ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సత్యప్రభ, టీడీపీ నాయకులు మీసాల రాజు, మురళీరాజు యనమల రామకృష్ణుడిని కలిసి మార్చి4న నిర్వహించే వరుపుల రాజా వర్ధంతి సమావేశానికి రావాలని ఆహ్వానించారు. ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకులు అమరాది వెంకట్రావు, పర్వత సురేష్, కొమ్ముల కన్నబాబు, ఇతం శెట్టి భాస్కర బాబు, సూది బూరయ్య, పైలా సాంబశివరావు, బొదిరెడ్డి గోపి పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 26: సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించి సమాజంలో ఉత్పన్నమయ్యే సైబర్ ప్రమాదాల నివారణకు తమవంతు సహకారమందించాలని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. వర్సిటీలోని సెనేట్ హాల్లో యూసీఈకేలోని సీఎస్ఈ విభాగం, ఎన్ఐఎంఎస్ఎంఈల సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అనే అంశంపై ఐదురోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను సోమవారం వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, శ్రీనివాసరావు, చక్రవర్తి,సురేఖ డైరెక్టర్లు పాల్గొన్నారు.

'తాడేపల్లిగూడెం తరలిరండి'

ఏలేశ్వరం, ఫిబ్రవరి 26: ఈనెల 28న తాడేపల్లిగూడెంలో జనసేన, టీడీపీ నిర్వహించే బహిరంగ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం యర్రవరంలో జనసేన మండల కార్యదర్శి గంగిరెడ్ల మణికంఠ నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు, ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు మాట్లాడుతూ ఇక్కడినుంచి పెద్దఎత్తున జనసేన, టీడీపీ నాయకులు, శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గెడ్డం శివ, కంచాల అనిల్, వి.సాయికిరణ్ పాల్గొన్నారు.

పల్లెపల్లెల్లో బీజేపీ జెండా

ఏలేశ్వరం,ఫిబ్రవరి 26: పల్లెపల్లెల్లో బీజేపీని బలోపేతం చేయాలని బూత్ కమిటీలకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని పరిమితడికలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కూరాకులరాజా ఆధ్వర్యంలో జిల్లాకార్యదర్శి కొల్లా శ్రీనివాస్ బీజేపీ జెండా ఆవిష్కరించారు. మోటుకూరి సంకురయ్య, యార్లగడ్డ వెంకట్రాయుడు పాల్గొన్నారు.

'స్థానికులకే ఇళ్లస్థలాలు ఇవ్వాలి'

తాళ్లరేవు, ఫిబ్రవరి 26: చొల్లంగి వాసులకే స్థానికంగా ఉన్నస్థలాల్లో పట్టాలు ఇవ్వాలని పలువురు లబ్ధిదారులు సోమవారం డిమాండ్ చేశారు. 27వ రోజుకు చేరుకున్న నిరసనదీక్ష శిబిరంలో పలువురు లబ్ధిదారులు నిరసన తెలియజేశారు. చొల్లంగివాసులకు జి.వేమవరం, పటవల గ్రామాల్లో నివాసయోగ్యంగా లేని పట్టాలను రద్దు చేసి చొల్లంగిలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వల్లు నాగసురేష్, విస్సాకుల సత్తిబాబు, పి.శ్రీను, చినబాబు, బొడ్డు రమణ, లోవ, దుర్గ, దుర్గాదేవి, అల్లం లక్ష్మి పాల్గొన్నారు.

'సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 26: రబీలో సాగునీటి సమస్యపరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం గ్రామాల్లో వరి పంటపొలాలుకు సాగునీరు అందడం లేదని ప్రజాప్రతినిధులనుంచి వచ్చిన వినతుల మేరకు ఆమె సోమవారం పంటపొలాలు పరిశీలించారు. తక్షణం సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీ వెంట గొల్లప్రోలు జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు, ఏకే మల్లవరం ఉపసర్పంచ్ అరిగెల మణిబాబు ఉన్నారు.

అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా బీఎస్ఎన్ రాజు

అన్నవరం, ఫిబ్రవరి 26: అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా బీఎస్ఎన్ రాజు నియమితులయ్యారు. సోమవారం రత్నగిరిపై జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్ష పదవికి ఇద్దరు ఉద్యోగులు పోటీపడగా డ్రా ద్వారా బీఎస్ఎన్ రాజు విజయం సాధించారు. కార్యదర్శిగా బలువు సత్యశ్రీనివాస్, కోశాధికారిగా పెద్దింటి తలుపులయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కాగా గౌరవ అధ్యక్షులుగా డీవీఎస్ కృష్ణారావు, కృష్ణప్రసాద్, గంగాధరభట్ల గంగబాబు వ్యవహరించనున్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 26: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీనివాసరావు, వినయ్ స్వామికి విశేష అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా శ్రీనివాసుని ప్రాణప్రతిష్ట

తుని రూరల్, ఫిబ్రవరి 26: ఎస్.సూరవరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఏకశిల విగ్రహాల ప్రతిష్ట శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో హోమ క్రతువులతోపాటు ప్రత్యేక పూజలను పండితులు నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, పార్టీ కీలక నేతలు హాజరయ్యారు. ప్రాణప్రతిష్ట తర్వాత ఆలయ ధర్మకర్త ఎస్.సూరవరం మాజీ సర్పంచ్ చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి) దంపతులు స్వామి దివ్య కల్యాణాన్ని నిర్వహించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దాపురం, ఫిబ్రవరి 26: స్థానిక మహారాణీ సత్రం ఆధ్వర్యంలో ఈనెల 27న సత్రంవద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని సత్రం ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. కిరణ్ కంటి ఆస్పత్రి పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు.

'అర్జీలను త్వరగా పరిష్కరించాలి'

పెద్దాపురం, ఫిబ్రవరి 26: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వారంవారం నిర్వహించే స్పందనలో స్వీకరించే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీవో జె.సీతారామారావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలను స్వీకరించారు. ఏడీబీ రహదారి విస్తరణలో భాగంగా ఆర్బీ కొత్తూరు జంక్షన్‌వద్ద కంకర గుట్టలు అడ్డుగా వేసేశారని, చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి కోరారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, ముఖ్య గమనిక, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, అంబాజీపేట మ్యారేజీబ్యాండు, రాజధాని ఫైల్స్, గుంటూరు కారం

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: సుందరంమాస్టర్, భ్రమయుగం, రాజధాని ఫైల్స్, డ్రీల్, ఊరుపేరు భైరవకోన, మస్త్ షేడ్స్ ఉన్నాయిరా

తిరుమల: సూర్యుడనైతప్పలు(?), అంబాజీపేట మ్యారేజీబ్యాండు

లక్ష్మి	:	ఒక్కడు
సీ అండ్‌సీ1	:	సిద్ధార్థరాయ్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	ఊరు పేరు భైరవకోన
పద్మప్రియ	:	సుందరంమాస్టర్
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	సిద్ధార్థరాయ్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

రూరల్ సీటు కేటాయింపుపై టీడీపీ కార్యకర్తల నిరసన

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 26: కాకినాడ రూరల్ సీటును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడాన్ని నిరసిస్తూ టీడీపీ శ్రేణులు కొందరు ఆందోళన చేపట్టారు. వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి నివాసానికి సోమవారం చేరుకుని పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు తొలగించి గందరగోళం సృష్టించి హంగామా చేశారు. పార్టీలో కొంతమంది నాయకులు పని కట్టుకుని కావాలనే వీరిపై కక్షపూరితంగా వ్యవహరించి గ్రూపులను ప్రోత్సహిస్తూ, పార్టీని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని కార్యకర్తలు ఆరోపించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. స్వామినగర్‌కు చెందిన ఎలగా లోవరాజు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో ఉలిక్కిపడ్డ పార్టీ నాయకులు, సత్తిబాబు వెంటనే తేరుకుని వారించి సర్దిచెప్పారు.

'చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి'

కరప, ఫిబ్రవరి 26: సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే మార్చి 1న తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. కరప భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాకా కార్మికులు దాచుకున్న సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు. చలో కలెక్టరేట్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ, కామిరెడ్డి సురేష్, కరప యూనియన్ సభ్యులు కొండేపూడి తాతీలు, శివ, సుబ్రహ్మణ్యం, నూకరాజు, వై.సుబ్రహ్మణ్యం, లకమన రాంబాబు పాల్గొన్నారు.

'పేదల పాకలు తొలగించకుండా భరోసా కల్పించాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 26: పూలే కాలనీలోని పేదల పాకలు తొలగించకుండా భరోసా కల్పించాలని, బలవంతంగా పాకలు తొలగిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, తుమ్మల సునీత సోమవారం కాకినాడ కార్పొరేషన్ కమిషనర్‌ను కలిసి కోరారు. ఈ మేరకు సమర్పించిన వినతిపత్రంలో గత ప్రభుత్వంలో పూలే పాకలలో నివాసం ఉంటున్న వారికి మౌలిక సదుపాయలు కల్పించారని, వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చే సమయానికి ప్రభుత్వం మారడంతో పట్టాలు ఇవ్వలేకపోయామని తెలిపారు. ఇప్పుడు ఈ పట్టాలను అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు తమ దగ్గర ఉంచుకుని పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. పేదల స్థలాలను లాగేసుకునేందుకు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వివరించారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 26: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీజీహెచ్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన సోమవారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు మలక వెంకటరమణ మాట్లాడుతూ 24 రోజులుగా ఆందోళన చేస్తున్నా కాంట్రాక్టర్ గానీ, జీజీహెచ్ అధికారులు గానీ పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయకుమార్ జె.శేషుబాబు, ఎస్.వాసు, రాయుడు రమేష్, రవిశంకర్, పద్మావతి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

గజ్జనపూడిలో బయటపడ్డ వైసీపీ వర్గ విభేదాలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 26: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ సమక్షంలో వైసీపీలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. గజ్జనపూడిలో సోమవారం నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో వైసీపీలో రెండువర్గాల మధ్య తోపులాట, వాగ్వివాదాలకు జరిగాయి. గ్రామంలో సర్పంచ్ గొనగాల అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అల్లు సూర్యసత్యనారాయణ వర్గీయులు, గొనగాల రమణ రెండు గ్రూపులుగా విడిపోయి సచివాలయంవద్ద వాగ్వివాదం, తోపులాటలకు దిగారు. ఇన్‌చార్జ్ వరుపుల ఒకవర్గానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఇంటికి వెళ్లారనే దానిపై ఈ రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ప్రత్తిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి తరలివచ్చి అదుపు చేశారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి'

తుని రూరల్, ఫిబ్రవరి 26: వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తెలిపారు. సోమవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలో 64 అంశాలు చర్చ జరగ్గా 64అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. తుని పట్టణంలో పలు వార్డుల్లో రోడ్లు, డ్రైన్‌లు, కల్వర్టులు టెండర్లకు సంబంధించిన ఫైల్స్‌పై చర్చ జరిపి ఆమోదం తెలిపారు. వేసవి సమీపిస్తున్న వేళ మండలంలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాల ఏర్పాటుకు రూ.10లక్షలు నిధులు ఖర్చుకు ఆమోదం తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై 'స్పందన'లో ఫిర్యాదు

సామర్లకోట, ఫిబ్రవరి 26: సామర్లకోట మండలం పనసపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి అమర్నాధరెడ్డి పలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తాను స్పందన గ్రీవెన్స్‌లో అధికారులకు చేసిన ఫిర్యాదు కారణంగా పంచాయతీ కార్యదర్శి తనకు కొందరితో ఫోన్లు చేయించి బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రాయుడు మోజెస్‌బాబు ఫిర్యాదు చేశారు. తాను ఆధారాలతో సహా పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై దర్యాప్తు జరిపి పంచాయతీ ఆదాయాలను కాపాడాలని మాత్రమే ఇచ్చానని, ప్రభుత్వ ఉద్యోగి అయిఉండి కూడా ప్రైవేట్‌వ్యక్తులతో బెదిరింపు చర్యలకు పాల్పడడంవల్ల తనకు పంచాయతీ కార్యదర్శినుంచి ప్రాణహాని ఉందని, అధికారులు తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యం: కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 26: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ జె.వెంకటరావు, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌కు ఎనిమిది, స్పందనకు 12మంది వివిధ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, వివిధ విభాగాధిపతులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

'గ్రీన్‌టాక్స్ పేరిట రక్తాన్ని పీలుస్తున్న ప్రభుత్వం'

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 26: గ్రీన్‌టాక్స్ పేరిట లారీ, ఆటో, ఇతర వాహనదారుల రక్తాన్ని వైసీపీ ప్రభుత్వం పీల్చుకుంటోందని జనసేన కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. డివిజన్ అధ్యక్షుడు సుంకర సురేష్, కార్యదర్శి సాధనాల గంగాధర్ ఆధ్వర్యంలో 36వ డివిజన్ బాలాజీచెరువు, టీటీడీ కల్యాణ మండపం ప్రాంతంలో జగన్ ప్రభుత్వంపై యుద్ధానికి మేము సిద్ధమే అనే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి శశిధర్ మాట్లాడుతూ బడుగు జీవుల స్వయం ఉపాధికి ప్రోత్సహించకుండా వారి నెత్తిన గ్రీన్ టాక్స్ వేసి జలగలా పన్నులు వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అడబాల సత్యనారాయణ, చీకట్ల శ్రీనివాస్, నారాయణరావు, రాజేశ్వరి, పావని, తరుణ్, మావులూరి సురేష్, సతీష్‌కుమార్, రాజేంద్రప్రసాద్, పాలిక శివ పాల్గొన్నారు.

'అధికారంలోకి రాబోయేది టీడీపీ-జనసేన ప్రభుత్వం'



సమావేశంలో మాట్లాడుతున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 26: టీడీపీ-జనసేన కూటమికి ప్రజల్లో అభిమానం పెరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ పాలనకు చరమగీతం పాడి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ అన్నారు. సర్పవరం పూలమార్కెట్ సెంటర్‌లో మాజీ సర్పంచ్ పుల్ల శ్రీరాములు ఆధ్వ ర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన ముద్దన సూర్యప్రకాశరావు బ్రదర్స్, పంచాయతీ 3వ వార్డు సభ్యులు విజయ్‌తోపా టు 150మందికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈనెల 28న చంద్రబాబు, పవన్‌లు నిర్వహించే సభ జయప్రదానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుల్ల శ్రీను, బుజ్జి, పుల్ల వీరరాఘవులు, పుల్ల చినవీరరాఘవులు, జోకా సూరిబాబు, పుల్ల నారయ్య కాపు, పుల్ల చంద్రరావు, శీలం సుబ్బారావు పాల్గొన్నారు.

కొట్టె బ్రదర్స్ ప్రచార వాహనాల ప్రారంభం

కాకినాడ రూరల్ సర్పవరంలో సోమవారం జనసేన-టీడీపీ అభ్యర్థుల విజయం కోసం విజయవాడకు చెందిన ఎన్ఆర్ఐ కొట్టె బ్రదర్స్ సౌజన్యంతో సమకూర్చిన 20 ప్రచార వాహనాలను సోమవారం సర్పవరం పూలమార్కెట్‌వద్ద జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌పై ఉన్న అభిమానంతో ఎన్ఆర్ఐ కొట్టె బ్రదర్స్ వాహనాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొట్టె వెంకటరావు, కొట్టె సాయి, కొట్టె వెంకటేశ్వర్లు, కొట్టె అర్షద్, చిల్లా మహేష్ పాల్గొన్నారు.

తాళ్లూరులో టీడీపీ సంబరాలు



తాళ్లూరులో కేక్ కట్ చేస్తున్న యనమల దివ్య

తుని రూరల్, ఫిబ్రవరి 26: టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల రామకృష్ణుడితో కలిసి పార్టీ ఇన్‌చార్జ్ యనమల దివ్య మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో భాగంగా తాళ్లూరులో పర్యటించడంతో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా సీటు ఖరారు కావడంతో పార్టీశ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన దివ్య ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, జనసేన కోఆర్డినేటర్ చోడిశెట్టి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ ఆవుగంటి వెంకటరమణ, జక్కాన రామనాయుడు, తమరాన సత్యనారాయణ ఉన్నారు.

2న ఉచిత కంటి వైద్యశిబిరం

కొత్తపల్లి, ఫిబ్రవరి 26: వచ్చేనెల 2న కొత్తపల్లిలో సురక్ష మల్టీస్పెషాల్టీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. సురక్ష ప్యాలెస్ కన్వెన్షన్ హాలులో ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శ్రీకిరణ్ కంటి ఆస్పత్రి వైద్యనిపుణులతో వైద్యపరీక్షలు చేపట్టనున్నట్టు చెప్పారు.

జేఎన్టీయూకేలో మెగా రక్తదాన శిబిరం

జేఎన్టీయూకే, ఫిబ్రవరి26: వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ సెల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్‌ప్రసాదరాజు ముఖ్యఅతిథిగాను, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ వైడీ రామారావు అతిథులుగా పాల్గొనగా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జి.శ్యామ్‌కుమార్ పర్యవేక్షించారు.

బాబా ఆలయ వార్షికోత్సవం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 26: మండలంలోని సిరిపురంలో సోమవారం శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు టీడీపీ, జనసేన ఇన్‌చార్జులు వరుపుల సత్యప్రభ, వరుపుల తమ్మయ్యబాబు బాబాఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంవద్ద 2వేలమందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధనేకుల రామకృష్ణ, టీడీపీ నాయకులు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, బస్వా ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

గండేపల్లి, ఫిబ్రవరి 26: జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించిన మెగారక్తదాన శిబిరంలో గండేపల్లిమండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ విద్యార్థులు 70మంది, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 52మంది రక్తదానంచేశారు. విద్యార్థులను ఆదిత్య ఇంజనీరింగ్‌కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు అభినందించారు.

కానిస్టేబుళ్లకు అభినందన

గండేపల్లి, ఫిబ్రవరి 26: గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో సహకరించిన గండేపల్లి హెచ్‌సీ నాగరాజు, కానిస్టేబుళ్లు వీరబాబు, కాశి, శివరామకృష్ణను సోమవారం పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి నగదు రివార్డుతో అభినందించి సత్కరించారు. ఈనెల 19న గండేపల్లి మండలం మురారి పోలవరం కాలువవద్ద 250కిలోల గంజాయిని తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్టుచేసి గంజాయి, రెండు మోటారుసైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వారిని అభినందించారు. జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో ప్రథమస్థానం

గండేపల్లి, ఫిబ్రవరి 26: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో ఓపెన్ కాంపిటీషన్‌లో పవర్ లిఫ్టింగ్ మాస్టర్స్ కేటగిరీలో, బెంచ్‌ప్రెస్‌లో గండేపల్లి హెడ్ కానిస్టేబుల్ గుబ్బల శ్రీనివాసనారాయణమూర్తి అలియాస్ టైసన్ ప్రథమస్థానం సాధించారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి విజేత టైసన్‌ను సత్కరించి 54ఏళ్ల వయసులో ప్రథమస్థానం గెలవడం అభినందనీయమన్నారు.

తోట ఆత్మీయ సమావేశం

గండేపల్లి, ఫిబ్రవరి 26: ఇళ్లు నిర్మించుకునేందుకు గత నాయకులు అనుగుణంగా లేని స్థలాలు కొనుగోలు చేశారని వైసీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. నీలాద్రిరావుపేటలో సర్పంచ్ సురేష్ నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇళ్లకు అనుకూలంగా ఉండే స్థలాలు ఇప్పించాలని గ్రామస్థులు ఆయన్ను కోరారు. తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, మద్దిపట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

కుంతీమాధవస్వామి హుండీల లెక్కింపు

పిఠాపురం, ఫిబ్రవరి 26: పట్టణంలోని కుంతీమాధవవస్వామి దేవస్థానంలో హుండీలను సోమవారం లెక్కించారు. హుండీల ద్వారా రూ2,87,880ల ఆదాయం లభించింది. గతేడాది ఇదే కాలానికి రూ.2.32లక్షలు మాత్రమే ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయశాఖ పర్యవేక్షణాధికారి వడ్డి ఫణీంద్రకుమార్, ఈవో నున్న శ్రీరాములు, కుంతీమాధవస్వామి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక

శంఖవరం, ఫిబ్రవరి 26: కత్తిపూడి సీతారామా కళాశాలలో డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులు మధ్యాహ్నం ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఈహెచ్ వీరబాబు, వెంకటేశ్వరరావు, మొగలి అక్కారావు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

తొండంగి, ఫిబ్రవరి 26: మండలంలోని శృంగవృక్షం గ్రామానికి చెందిన సుంకర శివాజీ(35) అనే భవన నిర్మాణ కార్మికుడు సోమవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్టు తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ తెలిపారు. భవన నిర్మాణంలో సెంట్రింగ్ పనిచేస్తుండగా విద్యుత్‌వైరు తగిలి అపస్మారక స్థితికి చేరుకోవడంతో తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

శివ పంచాయతన క్షేత్ర భూమిపూజ

గండేపల్లి, ఫిబ్రవరి26: తత్వం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ నేతృత్వంలో గండేపల్లి మండలం పి.నాయకంపల్లిలో రూ.25 కోట్లతో నిర్మించే ఆలయానికి శివపంచాయతన క్షేత్రశంకుస్థాపన సోమవారం నిర్వహించారు. తుని పీఠాధిపతి శ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో జరిగింది.

వర్చువల్‌లో ఆర్‌యూబీలు, రైల్వేస్టేషన్ ప్రారంభించిన ప్రధాని మోదీ

పిఠాపురం, ఫిబ్రవరి 26: రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిచ్చినట్లు కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. పిఠాపురంలో రూ.18 కోట్లతో ఆధునికీకరించిన రైల్వేస్టేషన్‌ను, గోర్స, మాధవపురం రైల్వేగేట్లవద్ద నిర్మించిన ఆర్‌యూబీ(రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి)లను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎంపీ గీత, ఇతర ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో రైల్వేలపరంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. త్వరలోనే ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. కార్యక్రమాల్లో జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు రావుల మాధవరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శ్రీకారం

సామర్లకోట, ఫిబ్రవరి 26: సామర్లకోట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల నిమిత్తం కేంద్రం రూ.25.37కోట్ల నిధులు కేటాయించడంతో ప్రధాని మోదీ న్యూఢిల్లీనుంచి వర్చువల్ పద్ధతిలో సోమవారం పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ ఎం.రమేష్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు యార్లగడ్డ దశరథరామారావు, బీజేపీ నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, పెద్దిరెడ్డి రవికిరణ్, తుమ్మల పద్మజ, పైడా భావనప్రసాద్. సుంకవిల్లి బాపిరాజు, యార్లగడ్డ అక్కరాజు, వల్లూరి బుల్లియ్య, కాపగంటి పైడిరత్నం, పి.జగన్నాథ్, ఎం.గోపాలకృష్ణ, బి.వెంకటబాబు, ఎ.భాస్కరరావు, కేతినీడి విజయరామయ్య, రైల్వేఅధికారులు రామకృష్ణ, సంతోష్ కుమార్, రవికాంత్, నారాయణరాజు, శ్రీనివాస్, కళ్యాణి, అనంతలక్ష్మి, చెన్నకేశవరెడ్డి, లోవరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

చేపూరులో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రారంభం

తుని రూరల్, ఫిబ్రవరి 26: కేంద్రం చొరవతో అమృత్ భారత్‌స్టేషన్ పథకంలో భాగంగా చేపూరు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఆ గ్రామంలో రైల్వేఅధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి వర్చువల్ పద్ధతిలో ప్రధాని బ్రిడ్జి ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొంద్రు నాగేశ్వరరావు, ఎంపీపీ రాము, రైల్వే డీఆర్ఎం రిప్రజెంట్ ఏడీఎం చక్రధరరావు పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు పాత్ర కీలకం'



తొండంగి, ఫిబ్రవరి 26: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు పాత్ర కీలకమైనందున ప్రతిఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్ఎస్ఏ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. పెరుమాళ్లపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటుహక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కుల, మత, ప్రాంత, భాషాభిమానాలకు లోను కాకుండా దేశసంక్షేమాన్ని కాంక్షించి సరైన నేతను ఎన్నుకోవాలన్నారు. ఎంఈవో షేక్‌బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రులకు, గ్రామస్తులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు లఘునాటికలు ప్రదర్శించారు. ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ వీవీ సత్యన్నారాయణ, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ పాల్గొన్నారు.